క్లుప్తంగా

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



కమిషనర్ పి.విశ్వనాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న బతుకన్న

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో వీధి దీపాలు మరమ్మతులు చేసే కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.బతుకన్న కోరారు. ఆయన మంగళవారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ పి.విశ్వనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌కు శాలువా కప్పి సన్మానం చేశారు. స్పందించిన కమిషనర్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా చర్చి రజతోత్సవం



మిలీనియం చర్చి సిల్వర్ జూబ్లీ వేడుకలను ప్రారంభిస్తున్న బిషప్ జోహనేస్ గోరంట్ల

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని ఉద్యోగ్ నగర్‌లో మిలీనియం బాప్టిస్టు చర్చి రజతోత్సవం మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. చర్చి సిల్వర్ జూబ్లీ వేడుకల్లో బిషప్ రెవరెండ్ డాక్టర్ జోహనేస్ గోరంట్ల ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి దైవ సందేశం అందించారు. చర్చి సీనియర్ సంఘ కాపరి రెవరెండ్ డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. 25 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఈ చర్చి దినదినాభివృద్ధి చెందిందన్నారు. క్రీస్తు నడవడిక వల్లే ఇది సాధ్యమైందన్నారు. మిలీనియం బాప్టిస్టు చర్చి క్వయర్ బృందం కె.శోభాసుజాన్ గ్రేస్ ఆధ్వర్యంలో క్రీస్తు గీతాలు ఆలపించారు. అనంతరం కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన పాస్టర్లను ఘనంగా సత్కరించారు.

టీబీ పరీక్షలు చేయించుకోవాలి



ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

కల్లూరు: టీబీ అనుమానిత లక్షణాలున్న వారందరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుల బృందం సూచించింది. మంగళవారం ఉలిందకొండ గ్రామ సచివాలయం-1 పరిధిలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ వ్యాధి అవగాహనపై ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ నవీన్‌కుమార్, ఎంపీహెచ్‌ఈఓ విజయ్‌కుమార్, సిబ్బంది స్వర్ణగౌరి, మద్దమ్మ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

వర్మీకంపోస్టు తయారు చేయాలి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

కల్లూరు: చెత్త సంపద (ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాలలో వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేయాలని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం చెట్లమల్లాపురం గ్రామంలో ఎంపీడీఓ పర్యటించారు. గ్రామాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగాలన్నారు. తడి, పొడి చెత్త వేరు వేరుగా అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్. భూపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

దేవీ దీవించు



దర్శనానికి బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ

కర్నూలు(రూరల్): కోరిన కోర్కెలు తీర్చే మా తల్లీ...ఎల్లమ్మ అంటూ భక్తులు వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయానికి పోటెత్తారు. వేకువజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కుంకుమర్చన, ఆకుపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

మైనర్లకు బండి.. ప్రమాదమండి!

- వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్న మైనర్లు
- తనిఖీల్లో భారీగా పట్టుబడుతున్న వైనం
- ఆరు మాసాల్లో 171 కేసులు నమోదు, రూ.6.62 లక్షలు జరిమానా
- ఇకపై తల్లిదండ్రులపై కేసుల నమోదుకు రంగం సిద్ధం



కర్నూలు: కర్నూలు నగరానికి చెందిన మనోహర్, రాహుల్ అభిషేక్, ధనుంజయ్ స్నేహితులు. ముగ్గురూ కలిసి ఔట్‌డోర్ స్టేడియం నుంచి పాత బస్తీ వైపు వేగంగా వెళ్తూ ఎక్సైజ్ కార్యాలయం ముందు అదుపుతప్పి కిందపడ్డారు. ఘటనలో మనోహర్ (17) మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడి వికలాంగుడయ్యారు.

కర్నూలు పూలబజార్‌కు చెందిన వహీద్ మియా పెద్ద మార్కెట్‌లో అకౌంటెంట్. స్టాంటన్‌పురంలో బంధువుల ఇంటికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా అశోక్ నగర్‌లో మైనర్లు మహమ్మద్ ఫర్హాన్ (16), ఫయాజ్ (16) బుల్లెట్ వాహనంపై వేగంగా వెళ్తూ ఢీకొట్టారు. ప్రమాదంలో వహీద్ మియా చనిపోవడంతో ఆ కుటుంబం జీవనాధారం కోల్పోయింది.

జిల్లాలో మైనర్లు ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ ఘటనల్లో కొందరు ప్రాణాలు కోల్పోతుంటే మరికొందరు ఇతరుల ప్రాణాలు తీస్తున్నారు. బాధిత కుటుంబాలకు క్షోభ మిగిలిస్తున్నారు. గట్టిగా పదిహేనేళ్లు కూడా ఉండవు. వాహనాన్ని బ్యాలెన్స్ చేయడం చేతకాదు. ఎదురుగా మనిషో, వాహనమో అడ్డొస్తే అదుపు చేసే సామర్థ్యం ఉండదు. అలాంటి బాలురు ద్విచక్ర వాహనాలపై చక్కర్లు కొడుతున్నారు. వేగంగా వెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. వారు చేసిన నేరానికి తల్లిదండ్రులు శిక్ష అనుభవించాల్సి వస్తుంది. వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు జరిమానాలు విధిస్తున్నా మార్పు కనిపించకపోవడంతో పోలీసులు కూడా కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు. ఇకపై మైనర్లకు వాహనాలు ఇచ్చిన యజమానులు లేదా వారి తల్లిదండ్రులపై కేసుల నమోదుకు శ్రీకారం చుట్టారు.

ఈ ఏడాది నమోదైన మైనర్ డ్రైవింగ్ కేసులు

నెల	కేసులు	జరిమానా (రూ.)
జనవరి	171	91,485
ఫిబ్రవరి	398	2,12,930
మార్చి	13	65,455
ఏప్రిల్	9	45,315
మే	30	1,51,050
జూన్	19	95,665

సామాజిక మాధ్యమాల్లో లైకుల కోసం

మైనర్లు కళాశాల మైదానాలు, నగర శివారు రింగు రోడ్డులో బైకులతో విన్యాసాలు చేస్తూ వీడియోలు రికార్డు చేసుకుంటున్నారు. వాటిని వివిధ మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇద్దరు ముగ్గురు కలిసి ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. వీరి చేష్టలతో మిగతా ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించగా ఆరు నెలల్లో పోలీసులే ఆశ్చర్యపోయేలా పట్టుబడ్డారు. వారిలో ఎక్కువ మంది పదో తరగతి, ఇంటర్ చదువుతున్న వారే ఉన్నారు. ఇటీవల సి.క్యాంప్ సెంటర్ వద్ద తనిఖీల్లో 9వ తరగతి విద్యార్థి పట్టుబడగా అతను నడుపుతున్న బైక్ ఇంచుమించు బుల్లెట్‌కు సమానంగా ఉంది. ఆ బైక్ బరువులో సగం కూడా లేని మైనర్ విద్యార్థి తన వెనకాల మరో ఇద్దరు మైనర్లను ఎక్కించుకుని వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వగా 'ఏమి చేస్తాం సార్.. బైక్ ఇవ్వకపోతే బడికి వెళ్లమంటూ బెదిరిస్తున్నారు. చచ్చిపోతామంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారంటూ' కొందరు తల్లిదండ్రులు వాపోయారు.

గారాబం.. కారాదు ప్రమాదకరం..

రహదారులపై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో యువకులే అధికంగా ప్రాణాలు కోల్పోతూ తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తున్నారు. జిల్లాలో మైనర్లు వాహనాలు నడుపుతూ మృత్యువాత పడుతున్న సందర్భాలు కళ్ల ముందే కనిపిస్తున్నాయి. పోలీసులు, రవాణా శాఖ అధికారులు ట్రాఫిక్ నిబంధనలపై నిత్యం అవగాహన కల్పిస్తున్నా ఇంకా కొందరి తల్లిదండ్రులు, చిన్నారుల్లో మార్పు కనిపించడం లేదు. మోటార్ వాహనాల చట్టం ప్రకారం 18 ఏళ్లు నిండినవారు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్న తర్వాతే బైక్‌లు, కార్లు నడపాలని చట్టం చెబుతోంది. ఇలా కాకుండా వాహనాలు నడిపితే, వాటి యజమానితో పాటు తల్లిదండ్రులను కూడా బాధ్యులను చేస్తూ కేసులు నమోదు చేయాలని పోలీసు శాఖ తాజాగా ప్రణాళిక సిద్ధం చేసింది.

మైనర్ పట్టుబడితే తల్లిదండ్రులపై కేసు



రోడ్లపై మైనర్లు వాహనాలు నడుపుతూ ఎక్కడ కనిపించినా వారి తల్లిదండ్రులు లేదా వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తాం. కొందరు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. తల్లిదండ్రుల్లో మార్పు రావాలి. పిల్లల సరదా కోసం ఆలోచిస్తే వారితో పాటు బయటి వారు కూడా ప్రమాదాల బారిన పడాల్సి వస్తుంది. తల్లిదండ్రుల గారాబం వల్ల పిల్లలు ప్రమాదంలో చిక్కుకుంటున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పిల్లలు వాహనం నడిపేటప్పుడు ప్రమాదం జరిగితే బీమా కూడా వర్తించదు. – విక్రాంత్ పాటిల్, ఎస్పీ

హంద్రీ - నీవాకు నీటి విడుదలకు నిర్ణయం



మోటర్లను పరిశీలిస్తున్న ఎస్ఈ పాండురంగయ్య, ఈఈ ఎన్.ప్రసాద్‌రావు

కర్నూలు సిటీ: శ్రీశైలం రిజర్వాయర్ నిండుకుండలా తొణికిసలాడుతుంటే హంద్రీ – నీవా సుజల స్రవంతి పథకం కాలువకు నీరు విడుదలకు డిమాండ్ వస్తుంది. కాలువ విస్తరణ పనులు సకాలంలో పూర్తికాకపోవడంతో నీటి విడుదలలో జాప్యం జరుగుతోంది. సాగు నీటి సలహా మండలి సమావేశాల్లో తీసుకున్న నిర్ణయం మేరకు కాలువకు మంగళవారం నుంచి నీటిని విడుదల చేయాలి. అయితే విస్తరణ పనులు జరుగుతుండడం.. పనులు పూర్తి చేసేందుకు రెండు రోజుల సమయం కావాలని కాంట్రాక్టరు అడిగారని నీటి విడుదలను వాయిదా వేశారు. ఈలోపు జల వనరుల శాఖ ఉన్నతాధికారుల నుంచి హంద్రీ – నీవా కాలువకు నీటి విడుదలకు సన్నద్ధం కావాలని ఆదేశాలు వచ్చాయి. సీఎం చంద్రబాబునాయుడు ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు మల్యాల వద్ద మోటార్లు ఆన్ చేసి కాల్వకు నీటిని విడుదల చేస్తారని షెడ్యూల్ రావడంతో ఇంజినీర్లు హడావుడిగా మల్యాల పంపింగ్ స్టేషన్‌లోని అన్ని మోటార్లను చెక్ చేసేందుకు అక్కడికి వెళ్లి, ఇంజినీర్లతో చర్చించారు. వారికి హంద్రీ – నీవా ఎస్ఈ పాండురంగయ్య, ఈఈ ఎన్.ప్రసాద్‌రావు పలు సూచనలు చేశారు. 9వ మోటార్‌ను సీఎంతో ఆన్ చేయించేందుకు నిర్ణయించినట్లు ఇంజినీరింగ్ వర్గాలు తెలిపాయి.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

కర్నూలు(సెంట్రల్): పెన్షనర్లకు పెండింగ్‌లో ఉంచిన బకాయిలను వెంటనే చెల్లించాలని పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యం, శివారెడ్డి, రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట పెన్షనర్లు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పెన్షనర్లపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందన్నారు. 2018 నుంచి పెంచిన డీఏ అరియర్స్ జమ చేయకపోవడం అన్యాయమన్నారు. దీనిపై పలుమార్లు ప్రభుత్వ పెద్దలను కలిసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. అలాగే 8వ వేతన సవరణను పెన్షనర్లకు వర్తింపజేయాలని, ప్రస్తుతం ఉన్న ఆరోగ్య బీమాను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలన్నారు. 11వ పీఆర్‌సీ బకాయిలను విడుదల చేసి, 12వ పీఆర్‌సీని నియమించాలని కోరారు.

డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించాలి



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ సభ్యులు

కర్నూలు(సెంట్రల్): డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడిచినా ఇంతవరకు డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాకపోవడం ప్రభుత్వ అవివేకానికి నిదర్శమని మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ ఫలితాలు వచ్చి మూడు నెలలు గడిచినా ఇంతవరకు డిగ్రీ అడ్మిషన్లను ప్రారంభించకపోవడం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆ శాఖపై ఉన్న అవగాహనను తెలియజేస్తుందన్నారు. తక్షణమే డిగ్రీ అడ్మిషన్లను ఆఫ్‌లైన్ విధానంలో చేపట్టాలని లేదంటే చలో విజయవాడకు పిలుపునిస్తామని స్పష్టం చేశారు. నగర అధ్యక్ష, కార్యదర్శులు అబూబకర్, సాయి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

లేజర్ రన్ పోటీల్లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్): రాష్ట్రస్థాయి లేజర్ రన్ పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు నరసరావుపేటలో నిర్వహించిన 8వ రాష్ట్రస్థాయి లేజర్ రన్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అండర్-15 మహిళల డబుల్స్ రిలే విభాగంలో రూప, ఉపశ్రీ (మొదటి స్థానం), సీనియర్ కేటగిరీ విభాగంలో మిక్స్‌డ్ డబుల్స్ రిలే కేటగిరీలో వెంకట భరత్, వెంకటేశ్వర్లు (మొదటి స్థానం), సీనియర్ పురుషుల విభాగంలో వెంకట భరత్ (కాంస్యం), మహిళల విభాగంలో వెంకటేశ్వరి (మొదటి స్థానం) సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అభినందించారు. లేజర్ రన్ సంఘం జిల్లా అధ్యక్షుడు అవినాష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై డ్రోన్‌తో నిఘా

- మొదటిరోజు 37 ఉల్లంఘన కేసులు
- రూ.46 వేలు జరిమానా



విశ్వేశ్వరయ్య సర్కిల్‌లో డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టిన పోలీసులు

కర్నూలు: కర్నూలు నగరంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు డ్రోన్ కెమెరా సేవలను వినియోగంలోకి తెచ్చారు. ట్రయల్ రన్‌లో భాగంగా మంగళవారం నగరంలోని రాజ్‌విహార్, బుధవారపేట, గాయత్రి ఎస్టేట్, విశ్వేశ్వరయ్య సర్కిల్, సి.క్యాంప్ సెంటర్, కొత్తబస్టాండ్, బళ్లారి చౌరస్తా ప్రాంతాల్లో డ్రోన్ కెమెరా ఎగురవేసి ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారిపై నిఘా ఉంచారు. ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, మైనర్ డ్రైవింగ్, రాంగ్ రూట్ ప్రయాణం తదితర వాటిపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచి వీడియోలు, చిత్రాల ద్వారా అపరాధ రుసుం విధించారు. మొత్తం 37 మంది ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినట్లు గుర్తించి రూ.46 వేలు అపరాధ రుసుం విధించినట్లు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు. ఇకపై కర్నూలు నగరంలో నిరంతరం డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేస్తామని, ఎక్కడైనా ట్రాఫిక్ జామ్, ఇతర సమస్యలు తలెత్తినా డ్రోన్ కెమెరాతో చిత్రీకరించి వెంటనే మొబైల్ సిబ్బందిని అప్రమత్తం చేసి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు సీఐ తెలిపారు.

వెండర్ జోన్ల ఏర్పాటుకు చర్యలు



వెండర్ జోన్ల ఏర్పాటుపై చర్చిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): నగరంలో వీధి వ్యాపారుల కోసం వెండర్ జోన్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. మంగళవారం కమిషనర్ మున్సిపల్ అధికారులతో కలిసి వెంకటరమణ కాలనీ, బిర్లా కాంపౌండ్, సీ.క్యాంపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వీధి వ్యాపారులకు సౌకర్యంగా ఉండేలా వ్యాపార సముదాయాల ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. తద్వారా నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించవచ్చని చెప్పారు. అంతకుముందు కమిషనర్ దేవనగర్, గాయత్రి ఎస్టేట్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

17న జిల్లాకు సీఎం చంద్రబాబు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 17న ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా ఎయిర్‌పోర్టుకు వస్తారని, అక్కడ అన్ని రకాల ఏర్పాట్లను ఇప్పటి నుంచే ప్రారంభించాలన్నారు. అక్కడి నుంచి సీఎం నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలంలోని మల్యాల ఎత్తిపోతల పథకానికి చేరుకొని హంద్రీనీవాకు నీటిని విడుదల చేస్తారన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. ఆ తర్వాత కర్నూలు ఎయిర్‌పోర్టుకు వచ్చి విజయవాడకు వెళ్తారన్నారు. ఈ మేరకు తాత్కాలిక పర్యటన వివరాలు ఉన్నాయని కలెక్టర్ వివరించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ హుస్సేన్‌పీరా, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్ రాజు, డీటీసీ శాంతకుమారి పాల్గొన్నారు.

చెత్త సేకరణ పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న సీఈఓ నాసరరెడ్డి

ఓర్వకల్లు: గ్రామీణ ప్రాంత ప్రజలు రోగాల బారిన పడకుండా చెత్త సేకరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి సూచించారు. ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని లొద్దిపల్లె గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని పలు వీధుల్లో విస్తృతంగా పర్యటించి మురుగు కాల్వలు, చెత్త కుప్పలను, పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. చెత్త సేకరణ ట్రాక్టర్ క్రమం తప్పకుండా వస్తుందా? లేదా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త సంపద) కేంద్రాన్ని సందర్శించారు. అదేవిధంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని మంచినీటి ట్యాంక్ వద్దకు వెళ్లి ట్యాంక్ శుభ్రం, క్లోరినేషన్ చేసిన తేదీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి మద్దిలేటి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి



విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్లుకు వినతి పత్రమిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ఉపసంహరించుకోవాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. మండల నాయకులు మధు, కృష్ణ మాట్లాడుతూ కూటమి నాయకులు 2024 ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తుంటే పగలగొట్టండని చెప్పి, అధికారంలోకి వచ్చాక దగ్గరుండి బిగిస్తుందన్నారు. ఎ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శీను, గోపి, యేసురాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరం బండిమెట్ట వీధి గంగాభవానీ సమేత కేదారేశ్వర స్వామి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. ఆషాఢ మాసం మంగళవారం పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గంగమ్మకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పూలబజార్ చిన్న అమ్మవారి శాల నుంచి గంగమ్మ గుడి వరకు మేళతాళాలు, డప్పుల సంబరాలతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి నైవేద్యాలు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు కట్టెలకృష్ణ, కొండపల్లి నారాయణ, నాగోషులు, మధు, జగన్, మనోహర్, మల్లి, శీను, నాని, నాగరాజు, చిన్న, జయశ్రీ, రమణమ్మ, బాబు, తదితరులు పాల్గొన్నారు.



శాకంబరీ అలంకరణలో లలితా అమ్మవారు

– ఆషాఢ మాసం మంగళవారం పురస్కరించుకొని ఈ–తాండ్రపాడు గ్రామంలోని నీలకంఠేశ్వర స్వామి దేవాలయం ఆవరణలోని లలితా అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో శాకంబరీగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సర్జరీని పరిచయం చేసిన మహోన్నతుడు సుశ్రుతుడు



సుశ్రుతుడి విగ్రహానికి పూజలు చేసిన కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ తదితరులు

కర్నూలు (టౌన్): ప్రపంచానికి సర్జరీని పరిచయం చేసిన ప్రాచీన వైద్యుడు సుశ్రుతుడు అని వైద్య విద్యా అదనపు సంచాలకులు, కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ అన్నారు. మంగళవారం జూలై 15న ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం పురస్కరించుకొని వైద్య కళాశాల ప్రాంగణంలో ఉన్న సుశ్రుతుడి విగ్రహానికి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. క్రీస్తు పూర్వం 600 ఏళ్ల క్రితమే సింధూ నాగరికత ప్రాంతంలో సుశ్రుతుడు సర్జరీలు చేశాడని, అప్పట్లోనే ప్లాస్టిక్ సర్జరీలు చేశారన్నారు. సర్జరీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ మంజులాబాయి మాట్లాడుతూ.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయంలో ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ డేను ప్రకటించారని గుర్తు చేశారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగం లైబ్రరీ పుస్తకాల కోసం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ భానుమూర్తి రూ. 25 వేలు విరాళం అందజేశారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ప్రకాష్, ప్రొఫెసర్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ విజయ్ చంద్రమౌళి, డాక్టర్ సింధూ ప్రియాంక పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడి మృతి

కర్నూలు: భవన నిర్మాణ పనుల్లో భాగంగా సిమెంటు సంచి మోస్తూ అదుపుతప్పి కింద పడటంతో తీవ్రంగా గాయపడిన కార్మికుడు నాగేంద్ర (43) ఆసుపత్రికి వెళ్లేలోగా మృతిచెందాడు. కర్నూలు బుధవారపేటలోని గ్యాస్ గోడౌన్ సమీపంలో మంగళవారం మూడంతస్తుల భవనంపైకి సిమెంటు సంచి మోసుకెళ్తూ అదుపుతప్పి కింద పడ్డాడు. చికిత్స నిమిత్తం వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈయనకు భార్య నాగమ్మతో పాటు ఇద్దరు కుమారులు, కూతురు సంతానం. మూడో పట్టణ పోలీసులు ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



వైద్య సేవలను పరిశీలిస్తున్న డాక్టర్లు రఘు, మోతీలాల్ నాయక్

కల్లూరు: ఇంటిని, ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. మంగళవారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని కె. మార్కాపురం గ్రామంలో నిర్వహించిన సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డెంగీ వ్యాధి సోకుండా ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోతీలాల్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.